రిపోర్టర్స్ కావలెను

నిజాలు నిర్భయంగా రాసే సత్తా ఉండి.. ఎలాంటి భయం.. పక్షపాతం అన్నది లేకుండా ఉన్నది ఉన్నట్లు రాయగలిగే రిపోర్టర్లు కావలెను. మీలో ఈ సత్తా ఉంటే కింది నెంబర్లకు రెజ్యూమో పంపండి.

95150 34555
84979 20544

# నేటి ప్రస్థానం

తెలుగు దిన పత్రిక

APTEL/2013/54506

ఎడిటర్: ఐతగోని రాఘవేంద్ర | గురువారం, 1 మే 2025 | సంపుటి: 12 | సంచిక: 47 | పేజీలు: 4 | వెల:10/-

అభంశుభం తెలియని చిన్నారులు వారు! తమచుట్టూ మనిషి రూపంలో నరరూప రక్షసులు ఉన్నారని తెలియని అమాయకులు! చాక్లెట్ ఇస్తానని ఒకరు... ఆడుకుందామని మరొకరు.. ఇంట్లో దిగబెడుతానని ఇంకొకరు పిలువగానే వెళ్లి వారి చేతుల్లో బలవుతున్నారు. ఎవరికి చెప్పుకోవాలో తెలియక. ఇంట్లో తెలిస్తే ఏం అవుతుందోనన్న ఆందోళనతో జరిగిన ఘోరాన్ని తన మనసులో దాచుకొని కుమిలికుమిలిపోతున్నారు! ఈ ఆగడాలు రోజురోజూ పెరిగిపోతుండటం ప్రతిఒక్కరూ ఆందోళన చెందుతున్నారు.

- హైదరాబాద్ ప్రధాన ప్రతినిధి, నేటి ప్రస్థానం





# పాపం పసిమొగ్గలు!

- వావి వరుసలు మరిచి కాటేస్తున్న కిరాతకులు
- రోజురోజుకూ పెరుగుతున్న కేసులు
- కఠిన శిక్షలు పడుతున్నా కానరాని మార్పు

అభం శుభం తెలియని చిన్నారులపై లైంగిక దాడులు

వివరాలు 2 పేజీలో..

# కష్టంతో కాక ఇష్టంతో చదివింది..

- పది ఫలితాల్లో 565 మార్కులు.. గణితంలో 100/100
- బ్రాంచ్‌లో ఫస్ట్ ర్యాంక్ సాధించిన విద్యార్థిని అభినందించిన ప్రిన్సిపాల్ భవాని

**ఎల్బీనగర్, నేటి ప్రస్థానం:** కష్టంతో కాక ఇష్టంతో ఆ విద్యార్థి చదివింది. తాను అనుకున్న మార్కులు సాధించింది. అందరితో శభాష్ అనిపించుకుంటున్నది ఐతగోని నిహారిక. బుధవారం ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో గణితంలో 100/100, మిగిలిన సబ్జెక్టుల్లో లాంగ్వేజ్‌ల్లో వరుసగా 93, 90, 96.. సైన్స్ 94, సోషల్ 92.. మొత్తం 600 మార్కులకు 565 మార్కులు సాధించింది. దీంతో విద్యార్థి కుటుంబ సభ్యుల ఆనందాలకు అవధుల్లేవు. పదిలో అత్యుత్తమ మార్కులు సాధించిన నిహారికను వనస్థలిపురం నారాయణ బ్రాంచ్ ప్రిన్సిపాల్ భవాని అభినందించారు. భవిష్యత్‌లో మరింత ఉన్నతంగా రాణించాలని సూచించింది.





# తెలంగాణ అభివృద్ధికి కృషి చేస్తా

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** తెలంగాణ సమగ్రాభివృద్ధి కోసం నూటికి నూరు శాతం శక్తి వంచన లేకుండా పని చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సంఘ సంస్కర్త బసవన్న స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. మహాత్మ బసవేశ్వర 892వ జయంతి సందర్భంగా రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. "సమాజంలో మార్పుల కోసం 12 వ శతాబ్దంలోనే పునాదులు వేసిన

మిగతా 4 లో



# కర్రెగుట్టలపై ఎగిరిన జాతీయ పతాకం

03

# ఏడు మహిళా పోలీస్‌స్టేషన్లు.. 1200 మంది సిబ్బంది

హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్ పునఃవ్యవస్థీకరణ




04

# స్వతంత్ర సమరయోధురాలు పశ్య కన్నమ్మ కన్నుమూత

సంతాపం ప్రకటించిన పలువురు నేతలు

02



నేటి ప్రస్థానం
తెలుగు దిన పత్రిక
గురువారం, 1 మే 2025



# మేమెంతో మాకంత

## రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే


### సీఎంకు బీసీ నేత ధనుంజయ నాయుడు విజ్ఞప్తి

**నేటిప్రస్థానం,హుజూర్ నగర్:** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన ప్రకారం మేం మెంతో మాకంత రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బుధవారం మఠంపల్లి మండల కేంద్రంలో బీసీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. బీసీ నాయకులుగా చెప్పుకుంటున్న కొందరు కొంతకాలంగా బీసీలకు 42 శాతం.. బీసీలకు 45 శాతం.. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనిహైదరాబాదులో కూర్చుని తరచూ పత్రిక ప్రకటనలు గుప్పిస్తున్నారని, కానీ ఎవరి దయాదాక్షిణ్యాలు బీసీలకు అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జన గణన ప్రకారం ఏ కులం జనాభా ఎంత ఉందో అంత శాతం రిజర్వేషన్లు ఇవ్వడంతో పాటు చట్టం చేయాలని డిమాండ్ చేశారు. తరచూ పార్టీలు మారడం, కొత్త సంఘాల పెట్టే బీసీ నాయకులు ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. 42 శాతమనేది బీసీల ఆకాంక్ష కాదని.. జనాభా నిష్పత్తి ప్రకారమే రిజర్వేషన్లు అన్నది వారి ఆశయమని గుర్తుంచుకోవాలన్నారు. ఇదే విషయమై అన్ని జిల్లాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట మఠంపల్లి మండల సీపీఐ కార్యదర్శి పున్నయ్య, బీసీ హక్కుల సాధన సమితి నాయకులు కొమ్రరాజు వెంకట్, బుర్రి చంద్రయ్య తదితరులు ఉన్నారు.

## ఇప్పుడే సీఎంఆర్ఎఫ్ చెక్కులు

# త్వరగా వస్తున్నాయి..

### వార్డు ఇన్‌చార్జి కోళ్ల పూడి యోహాన్



**నేటిప్రస్థానం, హుజూర్ నగర్:** బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సీఎంఆర్ఎఫ్ చెక్కులు త్వరగా వస్తున్నాయని హుజూర్ నగర్ 14 వ వార్డు ఇన్‌చార్జి కోలపూడి యోహాన్ అన్నారు. బుధవారం హుజూర్ నగర్ పట్టణంలో మంత్రి ఉత్తమ్ కుమార్ సహకారంతో, పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్ ఆదేశాలతో బాధితుడు నమోజు లక్ష్మాచారి ఇంటి దగ్గరకు వెళ్లిన హుజూర్‌నగర్ 14 వ వార్డు ఇన్‌చార్జి కోళ్లపూడి యోహాన్ రూ. 60,000 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును వార్డు సభ్యులతో కలిసి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం కంటే ఇప్పుడే సీఎంఆర్ఎఫ్ చెక్కులు త్వరగా రావడంతో పాటు 30 నుంచి 40 శాతం అమౌంట్ సైతం ఎక్కువగా వస్తుందన్నారు. ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రతి పేదవాడికి రూ.10 లక్షల వరకు వైద్యం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కమిటీ సభ్యులుపెద్దారపు రామకృష్ణ, దుగ్గి సైదులు, మామిడి అశోక్, కోళ్లపూడి కాంతయ్య, బండి నాగేశ్వరరావు, తుపాకుల శీను, మువ్వ బాబు, గొర్రె నరసింహ, కోటి, జింకల నరసింహ, రామకృష్ణారెడ్డి. కోళ్లపూడి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


# అంటరానితనాన్ని రూపుమాపాలి

### అర్ఐ గిరి ప్రసాద్

**హుజూర్‌నగర్, నేటి ప్రస్థానం:** సమాజంలో అంటరానితనాన్ని రూపుమాపాలని ఆర్ఐ గిరిప్రసాద్ అన్నారు. పౌరహక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మఠంపల్లి మండలం రఘునాథపాలెం గ్రామంలోని ఎస్సీ కాలనీలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గిరిప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు తన హక్కులను వినియోగించుకోవడంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నిమ్న జాతుల వారిని కించపరిస్తే చట్ట ప్రకారం శిక్షార్హులన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, మాతంగి జోజి మేడి సామెల్, అమరవరపు ప్రవీణ్, మేడి బాబు మాతంగి మస్తాన్, మేడి రమేశ్, మాతంగి మట్టయ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అయితే ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గెజిటెడ్ ఆఫీసర్లు ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉండగా అవేమీ పట్టనట్టు మొక్కు బడిగా కిందిస్థాయి ఉద్యోగులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



# పాపం పసిమొగ్గలు!



### వరుసకు పెద్దనాన్న..

నాలుగేండ్ల చిన్నారిపై వరుసకు పెద్దనాన్న అయ్యే వ్యక్తి లైంగిక దాడి చేశాడు. తల్లి పొత్తిళ్లలో నిద్రిస్తున్న చిన్నారిని అపహరించి ఈ దారుణానికి ఒడిగట్టాడు. ఈ ఘటన భూపాలపల్లి జిల్లా మహా ముత్తారం మండలంలోని ఓ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన ఒంటరి మహిళ తన కూతురితో కలిసి నిద్రిస్తున్న సమయంలో పెద్దనాన్న వరుసయ్యే కొమురయ్య బాలికను అపహరించి లైంగిక దాడి చేసి పత్తి చేనులో పడేసి వెళ్లాడు. బాలిక ఏడుస్తూ వెళ్లి తల్లికి చెప్పడంతో ఈ విషయం వెలుగు చూసింది.

### లైంగిక దాడి.. ఆపై హత్య

పశ్చిమ బెంగాల్ నుంచి ఓ మహిళ తన కూతురితో కలిసి జంషెడ్‌పూర్ స్టేషన్‌కు చేరుకొని ఆ రోజు రాత్రి రైల్వే స్టేషన్‌లో పడుకుంది. ఈ సమయంలో ఇద్దరు వ్యక్తులు ఆ పసిపాపపై లైంగిక దాడి చేశారు. ఆపై తల, మొండం వేరు చేసి హత్య చేశారు.



### పట్టపగలే పార్కులో..

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ పార్క్‌లో ఆడుకుంటున్నచిన్నారిపై పట్టపగలే పిస్తాహౌస్‌లో పని చేస్తున్న వెస్ట్ బెంగాల్‌కు చెందిన రిజ్వాన్ లైంగిక దాడి చేశారు. అపై గొంతు నులిమి చంపేందుకు ప్రయత్నిస్తుండగా అక్కడ ఉన్న స్థానికులు గమనించి చిన్నారిని కాపాడి యువకుడిని చితక బాదారు.

### పాత కక్షల నెపంతో..

పాత కక్షల నెపంతో ఓ రాక్షసుడు మూడేండ్ల పసిపాపపై లైంగిక దాడి చేసి చెరుకు తోటలో పడేశాడు. ఈ దారుణ ఘటన యూపీలోని లఖింపూర్ జిల్లాలో జరిగింది.

### చాక్లెట్ ఇస్తానని పిలిచి..

జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని పసునూర్‌లో మామా అని ఆప్యాయంగా పిలిచే చిన్నారిపై పారిశుధ్య కార్మికుడిగా పని చేసే బెజ్జంకి గంగారెడ్డి చాక్లెట్ కొనిస్తానని చెప్పి తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు.

### చిన్నారులకు అండగా పోలీసులు..



చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టేందుకు పోలీసులు నూతన పంథా అనుసరిస్తున్నారు. బాధితులకు సత్వర న్యాయం అందించేలా చర్యలు చేపడుతున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అన్ని ఠాణాల ఇన్‌స్పెక్టర్లు చిన్నారుల సంక్షేమ అధికారులుగా వ్యవహరిస్తున్నారు. పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేస్తున్నారు. అయితే ప్రభుత్వం కఠిన చట్టాలు అమలు చేస్తున్నా ఈ కేసులు ఆగకపోవడం దారుణం.

### పోక్సో ఈ-బాక్స్


చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులను చెప్పుకోలేని పరిస్థితుల్లో ఉన్న వారికోసం కేంద్ర ప్రభుత్వం నేషనల్ చైల్డ్ రైట్స్ పోర్టల్‌లో ఈ- బాక్స్ బటన్‌ను ప్రవేశపెట్టింది. పాఠశాలలు, బస్సులు, ఇంటి ఆవరణ, కుటుంబ సభ్యులు,



తెలిసిన వాళ్లు.. ఇలా ఎవరి నుంచైనా వేధింపులు ఎదురైతే చిన్నారులు నేరుగా నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ వెబ్‌సైట్‌లోని పోక్సో ఈ-బాక్స్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఇక ఫిర్యాదు అందుకున్న వెంటనే అధికారులు గోప్యతకు భంగం కలగకుండా విచారణ చేయనున్నారు.

### వేగంగా శిక్షలు..

పోక్సో కేసుల్లో నిందితులకు వేగంగా శిక్షలు పడుతున్నాయి. కేసుల దర్యాప్తు ముమ్మరం చేస్తున్న పోలీసులు సాక్ష్యాలను సేకరించి కోర్టుకు సమర్పిస్తున్నారు. దీంతో ఫాస్ట్ ట్రాక్ కోర్టులు వేగంగా తీర్పులు ఇస్తూ నిందితులకు శిక్షలు ఖరారు చేస్తున్నాయి. మొత్తంగా మూడేండ్లలో నమోదైన కేసుల్లో సత్వరంగా తీర్పులు వచ్చేలా కషి చేసిన రాచకొండ కమిషనరేట్ రాష్ట్రంలోనే మొదటి వరుసలో ఉంది.



## స్వతంత్ర సమరయోధురాలు

# పశ్య కన్నమ్మ కన్నుమూత

### సంతాపం ప్రకటించిన పలువురు నేతలు



**నేటిప్రస్థానం,హుజూర్ నగర్:** ప్రముఖ స్వాతంత్ర సమ-రయోధురాలు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరనారి పశ్య కన్నమ్మ బుధవారం ఉదయం మరణించారు. ఆమె మృతికి పలువురు సంతాపం ప్రకటించారు. ఆమె చేసిన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరీ రద్దుకు సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో.. 1941లో 8వ ఆంధ్ర మహాసభకు సోదరుడు దొంతిరెడ్డి శంభిరెడ్డితో కలిసి పాల్గొనటం, రహస్యంగా పార్టీ సాహిత్యాన్ని నాయకులకు చేరవేయడంలో, కుటుంబంపై రజాకార్ల దాడులకు తీవ్రంగా గాయపడిన తండ్రిని, ఇతర కుటుంబ సభ్యులను కాపాడుకోవడంలో చురుకుగా వ్యవహరించారు. రజాకర్ల ఎదురు దాడిలో సోదరుడు దొంతిరెడ్డి శంభిరెడ్డి చనిపోయినప్పుడు కోలుకోలేకపోయి-నా, నమ్మిన పార్టీలో కొనసాగి వివిధ స్థాయిలలో పార్టీ బాధ్యతలను నిర్వహించారు. 1971 నుంచి 1980వ సంవత్సరం వరకు హుజూర్‌నగర్ గ్రామ పంచాయతీ సభ్యురాలిగా, హుజూర్‌నగర్ పంచాయతీ సమితి కో ఆప్షన్ సభ్యురాలుగా బాధ్యతలను నిర్వహించారు. ప్రాణానికి ప్రాణంగా ఉన్న అన్న దొంతిరెడ్డి శంభిరెడ్డి మరణం, ఆయన పోరాట ప్రభావం కన్నమ్మపై తీవ్రంగా కొనసాగింది. అందుకే ఆయన ఆశయ సాధనలో జీవితాంతం భర్త పస్యరామ్ రెడ్డి సహకారంతో కష్టజీవుల సమస్యల పరిష్కారానికి కదం తొక్కిన మహిళ నాయకురాలు. నిరుపేదలకు వృద్ధాప్య , వితంతు పెన్షన్ ఇప్పించడంలో, వారి భూమిని ఆక్రమించుకోవటానికి ప్రయత్నించిన సంఘ వ్యతిరేక శక్తులను తరిమి కొట్టడంలో మడమ తిప్పని పోరాటం చేసిన నాయకురాలు. 1970 దశకంలోనే మహిళలకు కుట్టు మిషన్ సెంటర్ నిర్వహించి పదుల సంఖ్యలో మహిళలకు నైపుణ్యత ను పెంచి ఆర్థికంగా నిలపడానికి వారి ఇంట్లోనే ఒక గదిని కేటాయించి అనేక సంవత్సరాలు నిర్వహించారు. నిరుపేద పిల్లలకు బాల్వాడి సెంటర్ ను అనేక సంవత్సరాలు నిర్వహించి వారికి పోషకాహార పదార్థాలు క్రమంగా అందించటంలో స్కూలు టీచర్ ఆయాలతో కలిసి ఆ రోజుల్లోనే పనిచేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా మహిళా సమాఖ్య కన్వీనర్ గా, కార్యదర్శిగా,రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా, భారత జాతీయ మహిళాసమాఖ్య జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా సుదీర్ఘకాలం ఆరుట్ల కమలాదేవి, కట్కూరి సుశీల, గుజ్జుల సరదా దేవి, బ్రిజ్‌రాణి గౌర్ , చంద్ర రాజకుమారి, తదితరులతో కలిసి పనిచేశారు.

### కన్నమ్మసేవలు శ్లాఘనీయం..

హుజూర్‌నగర్ ప్రాంతంలో మొదటిసారిగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన కుటుంబాలకు స్వాతంత్ర సమరయోధుల పెన్షన్లు ఇప్పించటంలో కన్నమ్మ చేసిన ప్రయత్నం శ్లాఘనీయం. హుజూర్ నగర్ పట్టణంలో మహిళా మండలి భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చిన రోజు నుంచి స్థలం సాధించేంత వరకు తన ప్రయత్నాన్ని కొనసాగించారు. ప్రముఖ కమ్యూనిస్టు పార్లమెంటు సభ్యుడు దాసరి నాగభూషణ్ రావుతో పాటు.. గ్రామ పెద్దల సహకారం,ప్రభుత్వ నిధులతో మహిళా మండలి భవనాన్ని నిర్మించి ప్రముఖ స్వాతంత్ర సమరయోధురాలు క్విట్ ఇండియా ఉద్యమ నేత అరుణా అసఫ్ అలీ పేరు పెట్టడం ఈ ప్రాంత మహిళలను ఉత్తేజపరిచారు. 2004వ సంవత్సరం నుంచి నేటి వరకు వేల సంఖ్యలో యువ మహిళలకు మహిళలకు కంప్యూటర్ జర్దోషి మిషన్ సెంటర్ నిర్వహిస్తూ శిక్షణ ఇప్పించింది. కంప్యూటర్ నేర్చుకున్న అమ్మాయిలు అనేకమంది ఉ ద్యోగాల్లో కొనసాగుతున్నారు. ఇతర మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోగలిగారు.

**ఇటీవల తన సోదరుడు దొంతి రెడ్డి శంబిరెడ్డి స్మారక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మహిళా మండలి భవనంలోనే మొదటి అంతస్తులో పెద్దహాలును తన సోదరుడు దొంతిరెడ్డి శంభిరెడ్డి పేరుతో నిర్మించి ప్రారంభించుకునే సమయంలో కన్నమ్మ మరణించడం విషాదకరం. హుజూర్‌నగర్ ప్రాంతంలో మహిళ నాయకురాలుగా.. కమ్యూనిస్టు నాయకురాలు చిరస్మరణీయమైన పాత్రను నిర్వహించిన పశ్యకన్నమ్మ మనందరికీ ఆదర్శం.**

# గ్రూప్-1 మెయిన్స్ కీ పాయింట్స్ లేకుండా పేపర్ ఎలా దిద్దారు?



ఇటీవల తెలంగాణ రాష్ట్రంలోని గ్రూప్- 1 మెయిన్స్ ఫలితాలు విడుదలైనాయి. ఫలితాలపై అభ్యర్థులు పలు అనుమానాలు లేవ-నెత్తుతున్నారు. మరోవైపు అభ్యర్థుల ఆందోళన కూడా కొనసాగుతుంది. పరీక్ష ఫలితాల్లో దాదాపు 90 శాతం వరకు ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు అధిక మార్కులు వచ్చాయి. తెలుగు మీడియం విద్యార్థులలో కేవలం 10 శాతం వరకే సర్వీస్ వచ్చే విధంగా మార్కులు వచ్చాయి. ఈ క్రమంలో అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడం జరిగింది. దీంతో హైకోర్టు అపాయింట్మెంట్ ఆర్డర్ పై స్టే ఇచ్చింది. వాదనలు కొనసాగుతున్నాయి. పిటిషన్ తరపున నిన్నటి అడ్వకేట్ వాదనలను పరిశీలిస్తే.. గతంలో నోటిఫికేషన్ రద్దు చేయడం టీజీపీఎస్సీకి అధికారం లేదని చెప్పారు. కొంత మందికి లబ్ధి చేకూర్చే విదంగా కేవలం 60 పోస్టులు కలిపి కొత్త నోటిఫికేషన్ ఇచ్చారు. నోటిఫికేషన్ లో ప్రిలిమ్స్ & మెయిన్స్ హాల్ టికెట్స్ వేరుగా ఇస్తామని ఎక్కడ చెప్పలేదు. కానీ మెయిన్స్ పరీక్షలో వేరే హాల్ టికెట్ నెంబర్ ఇచ్చారు. మన దేశంలో జాతీయ స్థాయి పరీక్షలలో ఎక్కడ ఇలా జరగలేదు. ఇటీవల గ్రూప్- 1 మెయిన్స్ ఫలితాల్లో 16,17,18,19 సెంటర్లలో ఎక్కువ మంది సెలెక్ట్ అయ్యారు. ఎక్కువ మార్కులు కూడా వీళ్ళకే వచ్చాయి, కోఠి ఉమెన్స్ కాలేజీలో పురుషులకు టాయిలెట్ లేవని సెంటర్ వేయలేదనీ టీజీపీఎస్సీ సమాధానమిచ్చింది. కానీ ఇంకా 6 నుండి 7 మహిళ కాలేజీల్లో కూడా ఇదే విధానం ఎందుకు అవలంబించలేదనీ అభ్యర్థుల తరఫున న్యాయవాది వాదించారు. అక్కడ మహిళలు మరియు పురుషులను ఎలా కలిపి వేశారనేది ప్రశ్న.? ప్రిలిమ్స్ మెయిన్స్ హాల్ టిక్కెట్ నెంబర్ మార్చడం వెనక అవినీతి జరిగిందిని వాదించారు. మరోవైపు మెయిన్స్ హాల్ టిక్కెట్ల నంబర్ ఇచ్చే విధానంలో జెండర్ బేస్డ్ విధానం ఎలా అవలంభిస్తారు.? అలాంటప్పుడు అందరి మహిళ అభ్యర్థులకు ఇదే విధానం ఎందుకు పాటించలేదనీ అభ్యర్థుల తరపున అడ్వకేట్ ప్రశ్నించారు. ఈ విధానం కొంతమంది సెలెక్టడ్ అభ్యర్థుల కోసమా.?



## భాషాపరమైన వివక్ష ఎందుకు?

అభ్యర్థుల తరఫున వాదన అనంతరం టీజీపీఎస్సీ అడ్వకేట్ ను జడ్జ్ గారు కొన్ని కీలక ప్రశ్నలను అడిగారు. టీజీపీఎస్సీ గ్రూప్- 1 మెయిన్స్ పేపర్లను దిద్దించే క్రమంలో ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ వాళ్ళకి వేరే వేరే సమాధాన నమూనాలు ( బ్లూ ప్రింట్ ) ఇచ్చారా? అని అడిగారు. అప్పుడు టీజీపీఎస్సీ తరఫున లాయర్ అలాంటి వ్యవస్థ ఏది ఉండదు, నమూనా పత్రాలు ఇవ్వడం ఉండదు, దేశంలో ఎక్కడా ఉండదని వింత సమాధానం చెప్పారు. నిజంగా ఇలా బ్లూ ప్రింట్ లేనిది పేపర్లు ఎలా దిద్దుతారు. పదవ తరగతి పేపర్లను కూడా మూల్యాంకనం చేసేటప్పుడు బ్లూ ప్రింట్ ఉంటుంది. మరి టీజీపీఎస్సీ బ్లూప్రింట్ లేకుండా మెయిన్స్ పేపర్లను దిద్దిన తీరు ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇలా మూల్యాంకనం చేసిన పేపర్లో వచ్చిన మార్కులు కరెక్ట్ అని ఎలా నమ్మగలం?. మరోవైపు ఈ అంశంపై జడ్జ్ సైతం అలాంటప్పుడు సమాధానం రాసిన అభ్యర్థుల మార్కులు నిర్ణయం ఎలా చేస్తారు.? అని ప్రశ్నించారు. అంతేకాకుండా జడ్జిగారు తమిళనాడు లో వాళ్ళకి అన్ని భాషలు వచ్చు కానీ వాళ్ళు తమిళంకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు, మరి మన తెలుగు రాష్ట్రాలలో తెలుగు భాషకు ఎందుకు అవమానం, భాష పరమైన వివక్షను కోర్టు సమర్థించదనీ గొప్ప సమాధానమిచ్చారు. ఈ అంశాల అనంతరం నేటికీ మరోసారి వాదనలు వాయిదా పడ్డాయి. తెలంగాణ ప్రాంతంలో తెలుగు అధికారిక భాషగా ఉంది. వీరికి చాలా అన్యాయం జరిగింది. మెజార్టీ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు ఎంపిక కావడం పలు అనుమానాలకు దారి తీస్తుంది. ముఖ్యంగా ఇక్కడ మూల్యాంకనం సరిగ్గా జరిగిందా? జరగలేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు కొందరు పక్క పక్కన ఉన్న విద్యార్థులకు ఒకే రకమైన మార్కులు రావడం, నామమాత్రం రాసిన సగటు ఇంగ్లీష్ మీడియం అభ్యర్థికి వచ్చిన మార్కుల కన్నా ఎంతో విశ్లేషణాత్మకంగా రాసిన తెలుగు మీడియం అభ్యర్థులకు రాకపోవడం విస్మయం కలిగిస్తుంది. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులే తెలుగు మీడియంలో రాస్తుంటారు. వీరికి తీవ్ర అన్యాయం జరిగింది. టీజీపీఎస్సీ రాజ్యాంగబద్ధ సంస్థ అని, ప్రతి దానికి నిపుణుల కమిటీ పేరుతో మూల్యాంకనాన్ని దాచిపెట్టి అభ్యర్థులకు అన్యాయం చేయడం సరికాదు. అభ్యర్థులు అన్యాయం అని భావించినప్పుడు ఏ కమిటీ అయినా తమ వివరాలను బహిర్గతం చేయాల్సిందే. అప్పుడే పారదర్శక బహిర్గతం అవుతుంది. నియామకాలలో పారదర్శకత ఉన్నప్పుడే అభ్యర్థులకు భవిష్యత్తు నియామకాల పట్ల నమ్మకం కలుగుతుంది.

సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
7989579428






# పాకిస్థాన్ పాటపాడే సన్యాసులు ఇండియా విడిచివెళ్లాలి

### జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి

**ఎల్బీనగర్, నేటి ప్రస్థానం:** భారత్‌లో ఉంటూ పాకిస్థాన్ పాటపాడే వారిపై జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్,కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ ఉంటూ.. పరాయిదేశం వంతపాడే వారు ఇండియా విడిచివెళ్లాలని డిమాండ్ చేశారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకుల ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ డీర్‌పార్క్ వాకర్స్ అసోసియేషన్ కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి, హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఉగ్రదాడిలో చనిపోయినవారికి ఆత్మశాంతి చేకూరాలని ప్రార్థిస్తూ నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పర్యాటకుల ప్రాణాలు తీసిన ఉగ్రవాదుల చర్యను తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని.. ఉగ్రవాదులను కనిపెట్టి ఉరితీయాలన్నారు. "ఈ భావోద్వేగ సమయంలో 140 కోట్ల మంది భారతీయులంతా ఒక్కటిగా నిలబడాలి. మన దేశ సనాతన ధర్మం హిందుత్వాన్ని, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలి. ఇది రాజకీయాలకు అతీతంగా ఐకమత్యం చాటుకోవాల్సిన సందర్భం. దాడికి బాధ్యులైన వారిని ఉపేక్షించకూడదు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ముందుగా మనందరం ఐక్యమత్యంతో ప్రతి విషయంలో ముందుకు నడవాలి. కుల మత బేధాలు లేకుండా ముందుగా మనందరం హిందువులమనే భావన చైతన్యం ప్రతి ఒక్కరిలో రావాలి." అని అన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జగదీశ్, సభ్యులు వెంకట్ రెడ్డి, రవీందర్ రెడ్డి, బి.ప్రకాశ్‌రెడ్డి, చీరిక నర్సిరెడ్డి, విజయేందర్, రమణారెడ్డి, బుచ్చిరెడ్డి, ప్రశాంత్, కృష్ణ, మాణిక్ రెడ్డి, అమర్, గోవర్ధన్, ఆనంద్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాయల్ ఎన్‌ఫీల్డ్, పల్సర్ బైక్‌లే టార్గెట్!

### ముగ్గురు సభ్యుల అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్ ● 14 వాహనాలు స్వాధీనం

నల్లగొండ, నేటి ప్రస్థానం: రాయల్ ఎన్‌ఫీల్డ్, పల్సర్ బైక్‌లంటే ఆ దొంగకు మహా ఇష్టం. ఎక్కడైనా కనిపిస్తే చాలు.. తన దగ్గర ఉన్న పాత కీ తో హాండిల్ లాక్ ఓపెన్ చేస్తాడు. అనంతరం తస్కరించి తన దోస్తులకు వాటిని అప్పగిస్తే వారు వాటికి తక్కువ ధరకు అమ్మి వచ్చిన డబ్బుతో జల్సా చేస్తారు. ఇలా ముగ్గురు కలిసి ఆరు రాయల్ ఎన్‌ఫీల్డ్, ఏడు పల్సర్లు, ఒక్క షైన్ వాహనాన్ని తస్కరించగా.. ఈ అంతర్రాష్ట్ర ముఠాను నల్లగొండ పోలీసులు అరెస్ట్ చేసి.. ఆ వివరాలు వెల్లడించారు. గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన నలమాల ఎర్రబ్బాయి, గుంజి అంకమరావు, మట్టిపల్లి శ్రీకాంత్ ముగ్గురు ఓ ముఠాగా ఏర్పడ్డారు. గుంటూరుకు చెందిన నలమాల ఎర్రబ్బాయి మూడు సంవత్సరాలుగా నల్గొండ జిల్లాలోని దామరచర్ల, నల్గొండ, నార్కట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, ఆంధ్రప్రదేశ్‌లోని మార్టూర్, పొన్నూర్ పట్టణాలలోని ప్రభుత్వ కార్యాలయాలు, జన సంచారం ఉన్న హోటళ్లు, వైన్స్‌ల వద్ద అంతేకాక రాత్రి సమయాల్లో ఇంటి ఎదుట పార్క్ చేసిన రాయల్ ఎన్‌ఫీల్డ్, పల్సర్ బైక్‌లను దొంగిలిస్తున్నాడు. ఈ దొంగతనాలపై ఫిర్యాదు అందుకున్న వాడపల్లి పోలీసులు కేసును చాలెంజింగ్‌గా తీసుకున్నారు. బుధవారం తెల్లవారు జామున వాడపల్లి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి పట్టణ శివారులోని తెలంగాణ- ఆంధ్రప్రదేశ్ బార్డర్‌లో తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనాలపై వెళు_ండగా అనుమానంతో తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేకపోవడంతో విచారించగా నిందితులు దొంగిలించిన ఈ వాహనాలను అమ్మేందుకు గుంటూరు వెళ్తున్నామని చెప్పడంతో అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 26,50,000 విలువైన 14 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాక వీరు 13 కేసుల్లో నిందితులుగా ఉన్నారని వివరించారు. ఈ కేసు చేధించిన మిర్యాలగూడ రూరల్ %జ×ాచీణ% ప్రసాద్, %జజూ% ఇన్స్పెక్టర్ డానియెల్, వాడపల్లి %ూ×ూ%.శ్రీకాంత్ రెడ్డి, సిబ్బంది సతీశ్, భాస్కర్, వెంకటేశ్వర్లు, రషీద్, నల్లగొండ %జజూ% సిబ్బంది విష్ణువర్ధన గిరి, రాంప్రసాద్, పుష్పగిరి, శ్రీనివాస్ రెడ్డిని జిల్లా ఎస్పీ అభినందించి రివార్డు ప్రకటించారు.







# పదిలో సత్తా చాటిన ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల

**హుజూర్ నగర్, నేటి ప్రస్థానం:** హుజూర్‌నగర్ మండలంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు పదవ తరగతి ఫలితాలలో సత్తా చాటారు. మండలంలో ఒకటో ర్యాంకు ఐల మౌనిక (571/600), రెండు గోసుల త్రిష రెండో ర్యాంకు (558/600), మూడు (549/600), నాలుగు (535/600), ఐదు (534/600) ర్యాంకులను సాధించిన ఈ విద్యాలయం అత్యుత్తమంగా నిలిచింది. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయప్రద, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ విద్య శుభాకాంక్షలు తెలియజేశారు.



# కర్రెగుట్టలపై ఎగిరిన జాతీయ పతాకం

**ములుగు, నేటిప్రాస్థానం:** బ్లాక్‌హిల్స్‌గా పేరుగాంచిన కర్రెగుట్టల్లో మావోయిస్టుల కోసం భద్రతా బలగాలు వేట సాగిస్తున్నాయి. తొమ్మిది రోజులుగా ఆపరేషన్ కొనసాగిస్తున్న భద్రతా బలగాలు ఇప్పటికే అన్ని సరిహద్దు ప్రాంతాలను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నాయి. ఈ క్రమంలో గుట్టలపై భద్రతా బలగాలు జాతీయ జెండా ఎగురవేశాయి. మరోవైపు 44 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఆపరేషన్‌లో పాల్గొని అలసిన బలగాలు వెనక్కి వస్తున్నాయి. దీంతో వారి స్థానంలో బ్యాకప్ పార్టీలను తరలించారు. మరోవైపు నడిపల్లి, పూజారీ కాంకేర్ ప్రాంతాల్లో మంగళవారం బాంబుల మోత మోగగా.. మావోయిస్టుల ఆచూకీ కోసం బలగాలు ఉపగ్రహ ఛాయాచిత్రాలతో పాటు డ్రోన్లను సైతం వినియోగిస్తున్నారు. ఈ ఆపరేషన్ పర్యవేక్షణ కోసం ఐబీ (ఇంటెలిజన్స్ బ్యూరో) చీఫ్ తపన్ దేకా రంగంలోకి దిగారు. రాయ్‌పుర్‌లో ఆపరేషన్‌పై అధికారులతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు.

నేటి ప్రస్థానం
తెలుగు దిన పత్రిక
APTEL/2013/54506


# ఏడు మహిళా పోలీస్ స్టేషన్లు.. 1200 మంది సిబ్బంది

## హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్ పునఃవ్యవస్థీకరణ




రెండు సంవత్సరాలుగా పోలీసు స్టేషన్ హద్దులు, కొత్త పోలీస్ స్టేషన్లకు వెళ్లడంలో ఎదురవుతున్న సమస్యలపై ప్రజల నుంచి కొన్ని ఫిర్యాదులు రావడం.. ట్రాఫిక్ , లా అండ్ ఆర్డర్ పోలీసులకు కొన్ని ప్రాంతాలలో అధికార పరిధిపై గందరగోళం ఉండటం, సైబర్ క్రైమ్ వింగ్‌ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరంపై హైదరాబాద్ సిటీ అధికారులు అందరితో చర్చించి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా, మొత్తం హైదారాబాద్ సిటీ పోలీసుకు మంజూరైన 17,020 మంది సిబ్బందిని అంతర్గత సర్దుబాటు, పునః కేటాయింపులు మార్పులతో ప్రతి పాదనలుపంపగా.. ఇందుకు తెలంగాణ ప్రభుత్వం ఆమోదించింది. ఈ మార్పులతో మరో పదేండ్ల వరకు హైదరాబాద్ నగర పోలీసులు బాగా పనిచేయటానికి అనుకూలంగా మారింది.



**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్‌ను పునః వ్యవస్థీకరించారు. ఈ మేరకు బుధవారం జీవో నంబర్ 32ను విడుదల చేశారు. ఈ వివరాలను సిటీ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ తెలియజేశారు. హైదరాబాద్ నగర పోలీసు కమిషనరేట్‌ను 35 సంవత్సరాల తర్వాత జీవో నంబర్ 32 (హోం లీగల్ డిపార్ట్‌మెంట్) ద్వారా ఉత్తర్వులు ఇచ్చారు. దీని ప్రకారం 2 అదనపు లా అండ్ ఆర్డర్ జోన్‌లు – సౌత్ ఈస్ట్ ం సౌత్ వెస్ట్, 11 కొత్త లా అండ్ ఆర్డర్ డివిజన్‌లు, 1 అదనపు ట్రాఫిక్ జోన్ (ట్రాఫిక్ 3), మరో 11 లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లు (మొత్తం 71), మరో 13 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లు (మొత్తం 31) ఏర్పాటు చేశారు. నగరంలో ఉన్న 7 జోన్‌లకు 7 మహిళా పోలీస్ స్టేషన్‌లతో మహిళా భద్రతా విభాగం, ప్రత్యేక సైబర్ క్రైమ్ యూనిట్, ఐటీ వింగ్, నార్కోటిక్స్ వింగ్ ఏర్పాటు చేశారు. అదనంగా 1200 మంది సిబ్బందిని మంజూరు చేశారు.

### కొత్త లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు..

హైదరాబాద్ నగర పోలీస్ పరిధిలో 72వ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌గా టోలిచౌకి లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. ఇంతకు ముందు ఉన్న ఫిల్మ్‌నగర్ , మెహదీపట్నం (పూర్వం హుమాయున్ నగర్ పీఎస్), గోల్కొండ పీఎస్ పరిధిలో ఉన్న కొన్ని ప్రాంతాలు ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేసిన టోలిచౌకి పోలీస్ స్టేషన్ పరిధిలోకి తీసుకువచ్చారు.

### డివిజన్లు, పోలీస్ స్టేషన్ల పేరు మార్పు..

స్థానిక ప్రజలు తొందరగా గుర్తు పట్టడానికి వారికి అనువుగా 1వ లా అండ్ ఆర్డర్ డివిజన్ పేరు, 3వ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లకు స్థానికంగా ప్రసిద్ధి చెందిన స్థానిక సూచనలను ప్రతిబింబించేలా ఈ క్రింద విధంగా పేర్లు మార్చారు. గోల్కొండ డివిజన్‌ను ఇప్పుడు టోలిచౌకి డివిజన్‌గాను, సెక్రటేరియట్ పీఎస్‌ను లేక్ పీఎస్‌గా, హుమాయున్ నగర్ పీఎస్‌ను మెహదీ పట్నం పీఎస్‌గా, షాహినాయత్ గంజ్ పీఎస్‌ను గోషామహల్ పీఎస్‌గా పేరు మార్చారు.

### ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ల పునర్వ్యవస్థీకరణ..

28 లా అండ్ ఆర్డర్ డివిజన్ల ప్రకారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల హద్దులు ఉండాలని (ముందు నుంచి ఉన్న పద్ధతి ప్రకారం) ప్రస్తుతం ఉన్న మారేడ్‌పల్లి, బోయిన్‌పల్లి, నారాయణగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లను తీసేశారు. ప్రస్తుతం ఉన్న లా ఆండ్ ఆర్డర్ పోలీసు స్టేషన్ల పరిధి ప్రకారం వాటికి సంబంధించిన ఏరియాల్లో పనిచేయడానికి ట్రాఫిక్ నాంపల్లి పీఎస్, ట్రాఫిక్ అంబర్‌పేట్ పీఎస్, ట్రాఫిక్ లంగర్ హౌస్ పీఎస్, ట్రాఫిక్ బహదూర్‌పుర పీఎస్, ట్రాఫిక్ నల్లకుంట పీఎస్‌ల పేర్లు మార్చి ట్రాఫిక్ గాంధీ నగర్ పీఎస్, ట్రాఫిక్ ఉస్మానియా యూనివర్సిటీ పీఎస్, ట్రాఫిక్ కుల్సుంపుర పీఎస్, ట్రాఫిక్ ఛత్రినాకా పీఎస్, ట్రాఫిక్ సైదాబాద్ పీఎస్‌లుగా మార్చారు . ప్రత్యేక యూనిట్ల ఏర్పాటుతో మహిళా భద్రతా వింగ్ (WSW)ను బలోపేతం చేయడానికి: యాంటీ–హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (AHTU) – దీనికి 1 ఇన్స్పెక్టర్, 8–సిబ్బంది మరియు జువెనైల్ బ్యూరో యూనిట్ కు – దీనికి 1 ఇన్స్పెక్టర్ తో 7 మంది సిబ్బంది ఉంటారు అని తెలిపారు.

### సైబర్ క్రైమ్ సెల్ ఏర్పాటు..

ప్రతి సైబర్ క్రైమ్ సెల్‌కు 1 సబ్–ఇన్స్పెక్టర్, 5 పోలీస్ కానిస్టేబుళ్లతో సిబ్బంది ఉంటారు. ప్రస్తుత, భవిష్యత్ పోలీసింగ్ అవసరాలకు తగిన విధంగా లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాలకు మంజూరైన సిబ్బంది సంఖ్యతో బలోపేతం చేశారు. పునర్వ్యవస్థీకరణలో జరిగిన మార్పులు అధికార పరిధి పటాలు, సంప్రదింపు, పోలీసు స్టేషన్ వివరాలు, పోలీస్ స్టేషన్ల స్థానాలు త్వరలో హైదరాబాద్ సిటీ పోలీస్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు.



# ఓబీసీలకు న్యాయం బీజేపీతోనే సాధ్యం

### కేంద్రం కులగణన చేస్తామనడం శుభపరిణామం.. మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్



**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** జన గణనతో పాటు కుల గణన చేపడుతామని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం శుభపరిణామని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ అన్నారు. బుధవారం ఆయన ఓ ప్రతికా ప్రకటన విడుదల చేశారు. బ్రిటీష్ పాలన అనంతరం 1931లో మొదటిసారి ఓబీసీ కులగణనను అధికారంగా కేంద్ర ప్రభుత్వం చేయడం ఇది మొదటి సారి అన్నారు. ఇది కేవలం కుల గణనే కాకుండా ఆర్థిక, సామాజిక, విద్య స్థితిగతులను కూడా , శాస్త్రీయంగా నిర్వహించడం , ముమ్ముందు అన్ని వర్గాలకు న్యాయం చేయడానికి ఉ పయోగపడుతుందని తెలిపారు. ఇప్పటి వరకు 7 సార్లు జనగణన జరిగితే అందులో 6 సార్లు కాంగ్రెస్, మరోసారి పాక్షికంగా చేసిన కాంగ్రెస్ ఏనాడూ ఓబీసీ ఊసెత్తలేదన్నారు. బీజేపీ మాత్రమే ఓబీసీలకు అన్ని రంగాలలో న్యాయం చేయగలదనడానికి ఒక సూచకమని వివరించారు. అప్పటి వరకు ఓబీసీలకు పెద్దపీట వేసింది బీజేపీ.. మొదట బీసీని ( నరేంద్ర మోడీ ) ప్రధాన మంత్రి చేసింది.. మంత్రివర్గంలో దాదాపు 61% బహుజనులకు మంత్రి పదవులు ఇచ్చింది.. NCBC (నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్వర్డ్ క్లాసెస్) కు రాజ్యాంగ హోదా కల్పించింది.. నీట్ పరీక్షలో ఓబీసీ రిజర్వేషన్ కల్పన, కేంద్రీయ విద్యాలయ, సైనిక్ స్కూల్స్ మొదటి సారి ఓబీసీ రిజర్వేషన్ కల్పించింది.. అనేక పార్టీ, ముఖ్య మంత్రి పదవుల్లో ఓబీసీలకు స్థానం కల్పించిందన్నారు. అంతేకాక కేంద్ర పథకాలలో అత్యధికంగా ( విశ్వకర్మ, ఆవాస్ యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, స్వనిధి, ముద్ర లోన్స్, మత్యసంపద ) ఇలా అత్యధికంగా ఓబీసీలు ప్రయోజనాలకు పెద్దపీట వేసింది బీజేపీనేనన్నారు. కాంగ్రెస్ ఓబీసీ వ్యతిరేకి. తెలంగాణాలో 50 ఏండ్లకు పైగా కాంగ్రెస్ పాలిస్తే, కనీసం ఒక్క సారి కూడా ఓబీసీ ముఖ్య మంత్రి చేయలేదు. ఇప్పుడు ఓబీసీ పట్ల ముసలి కన్నీరు కారుస్తున్న రాహుల్ గాంధీ తెలంగాణాలో కనీసం ఓబీసీని ముఖ్య మంత్రి చేయలేదు. ఓబీసీ ముసుగులో ముస్లింలను చేర్చడమే వారి లక్ష్యమని విమర్శించారు.

# సీతారామ కాలనీ అధ్యక్షునిగా గూడూరు రమేష్ గౌడ్



ఉప్పల్, నేటి ప్రస్థానం: ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని సీతారామ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఉత్కంఠంగా జరిగాయి.కాలనీ అభివృద్ధి కొరకు శక్తివంచన లేకుండా పనిచేయాలనే దృఢ సంకల్పంతో గూడూరు రమేష్ గౌడ్ స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అండదండలతో కాలనీ ఎన్నికల బరిలోకి దిగాడు.కాంగ్రెస్ పార్టీ నాయకులు బజార్ జగన్నాథం గౌడ్ పై బిఆర్ఎస్ పార్టీ నాయకులు గూడూరు రమేష్ గౌడ్ ఘనవిజయం సాధించారు.ఈ సందర్భంగా అభిమానులు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేవాలయం ప్రాంగణం నుండి విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. అనంతరం పలువురు నాయకులు పుష్పగుచ్ఛములు అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాండాల శివకుమార్ గౌడ్, గూడూరు మహేష్ గౌడ్, మేకల శర్బయ్య గౌడ్, బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, లింగాల భరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అభివృద్ధికి కృషి చేస్తా

మొదటి పేజీ తరువాయి

గొప్ప సంఘ సంస్కర్త బసవన్న. కుల, మత, లింగ వివక్షల వంటి సమాజ అవలక్షణాలను తొలగించాలని, సమ సమాజాన్ని నిర్మించాలని బసవన్న ఎనలేని కృషి చేశారు. ప్రతి మనిషి గౌరవంగా బతకడానికి అవసరమైన ప్రణాళికలను రచిస్తూ ప్రభుత్వాలు విధానపరమైన నిర్ణయాలు తీసుకుని ముందుకు వెళ్లాలి. ప్రజా ప్రభుత్వం ఆ కోవలోనే బాధ్యతతో ప్రజల దగ్గరికెళ్లి సమస్యలు తెలుసుకుని హామీలను అమలు చేసే ప్రయత్నం చేస్తోంది. దేశంలోనే తొలి రాష్ట్రంగా తెలంగాణలో బీసీ కులగణన చేశాం. ఎస్సీ వర్గీకరణ పూర్తి చేశాం. వీటన్నిటినీ పకడ్బందీగా అమలు చేస్తాం. అందుకు అందరి నుంచి సంపూర్ణమైన మద్దతు ఉండాలి. నిరుపేదలకు సన్నబియ్యం, ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం, పేదవారికి ఇండ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, రూ. 500లకే సిలిండర్ అందివ్వడంతో పాటు 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలను ఇచ్చాం. రాష్ట్రానికి 2.5 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం. హైదరాబాద్ నగరాన్ని విస్తరించడానికి అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. బసవన్న స్ఫూర్తిగా ప్రజాస్వామిక విలువలు కాపాడాలి. ప్రజలు మెచ్చే విధంగా పరిపాలన అందించాలి. ప్రజల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలి. బసవేశ్వరుడి స్ఫూర్తితో నడుస్తున్న ఈ ప్రభుత్వం, భవిష్యత్తులోనూ అదే మార్గంలో నడుస్తుంది. వీరశైవ లింగాయత్‌ల సంక్షేమం, అభివృద్ధి కోసం వారిచ్చిన విజ్ఞాపనలను పరిశీలించి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. నేను మాట ఇచ్చానంటే నూటికి నూరు శాతం అమలు చేస్తా. రాబోయే పదేళ్ల పాటు తెలంగాణ ప్రజలకు జనరంజకమైన పరిపాలన అందిస్తాం. “ మని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

